క్లుప్తంగా

సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో స్థానిక సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ల పాల్గొన్నారు.

చిప్పలపల్లిలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కందుకూరు: కందుకూరు మండలం చిప్పలపల్లిలోని వేద పాఠశాలలో బుధవారం అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కామినేని ఆస్పత్రికి చెందిన వైద్యులు డాక్టర్ రాధికారెడ్డి, డాక్టర్ కావ్య, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సింధు, డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ వీణా, డాక్టర్ రాహుల్ తదితరులు 235 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవేర్ సంస్థ కార్యనిర్వాహణాధికారి వెంకన్న, కామినేని ఆస్పత్రి పీఆర్‌ఓ శ్రీధర్‌బాబు, వేద పాఠశాల నిర్వాహకుడు శశిభూషణ్‌శర్మ, వలంటీర్లు సునీల్, పవన్, సాయికిరణ్ జోషి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కుక్కల షెడ్‌ను తొలగించండి

పంచాయతీ కార్యదర్శికి కొత్తగూడవాసుల వినతి



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పంచాయతీ పరిధిలోని కస్తూర్బాగాంధీ పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన కుక్కల షెడ్డును తొలగించాలని కోరుతూ ఆ గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. షెడ్‌లో కుక్కల అరుపులు, దుర్వాసనతో పక్కనున్న విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే కుక్కలను అక్కడి నుంచి తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సురేందర్‌రెడ్డి, మర్రి శేఖర్‌రెడ్డి, సామ అజయ్‌రెడ్డి, సామ జంగారెడ్డి, తాళ్ల నరేందర్, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌ను సన్మానిస్తున్న శ్రవణ్

పహాడీషరీఫ్: బదిలీపై వెళ్తున్న బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌ను కొత్తపేట 4వ వార్డు మజ్లిస్ ఇన్‌చార్జి జింకల శ్రవణ్ బుధవారం పీఎస్‌లో సన్మానించారు. మూడున్నరేళ్ల పాటు బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన భాస్కర్ ప్రశాంత వాతావరణం ఉండేలా కృషి చేశారన్నారు. నేరాల నివారణకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

'ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య'

మహేశ్వరం: మండల పరిధిలోని కేసీ తండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో చేరిన కొత్త విద్యార్థులకు వైస్ ఎంపీపీ సునీతానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్ అక్షరాభ్యాసం చేయించారు. పలకలు పట్టించి పిల్లలచేత అక్షరాలు రాయించారు. కేసీ తండా సర్పంచ్ మోతీలాల్‌నాయక్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రవినాయక్, ప్రధానోపాధ్యాయుడునర్సింహ,ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 43, వంకాయ 33, బెండ 40, పచ్చిమిర్చి 75, కాకర 45, బీర 35, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 50. దొండ 35, ఆలు 20, ఉల్లి 17, గోకర 40, దోస 15, సొర 11, పొట్ల 13, అరటి 10, చిలగడదుంప 35, బీట్‌రూట్ 28, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 65. ఈ దరలు గురువారం 9 గంటల వరకు ఈధరలు అమలులో ఉంటాయి.

హరితహారం.. అపహాస్యం

- మేయర్ పార్టీ మారినప్పటి నుంచి కార్పొరేషన్‌లో వింత పరిస్థితి
- హరితహారంపై ఎవరికివారే అన్నచందంగా పనులు
- సమన్వయ లోపంతో అధికారుల్లో గందరగోళం



మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మొక్కలు

బడంగ్‌పేట్: ఎండాకాలం పోయి జూన్ మాసం వచ్చేసింది. తొలకరి వర్షాలు పలకరిస్తే భూమాత చల్లబడుతుంది. వర్షాలకు పుడమితల్లి పులకరిస్తుంది. ఆ సమయంలో హరితహారం మొక్కలు నాటితే ఏపుగా పెరిగి తొందరగా మొక్క కాస్త చెట్టుగా మరిపోతుంది. హరితహారం కోసం నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ ఏ నర్సరీలో మొక్కలు ఉన్నాయో తెలియడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. గతంలో పట్టించుకోని అధికారులు ఈ సారి హరితహారం గురించి పట్టించుకుంటారా అని ప్రశ్నిస్తున్నారు.

కార్పొరేషన్ పరిధిలో..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో హరితహారం సంగతే మరిచిపోయారు. నాయకులు ఎవరి పార్టీలకు వారు జై కొడుతున్నారు. ఏ పార్టీకి వంత పాడిన చిక్కుల్లో పడతామంటూ అధికారులు, సిబ్బంది మిన్నుకుంటున్నారు. హరితహారం పేరుతో మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతకు మనవంతుగా పాటుపడాలని ఉన్నతాధికారుల నుంచి సర్కులర్స్ వచ్చినప్పటికీ పాలకవర్గంలో పార్టీల పీకులాటలో ఏలుతున్న కార్పొరేటర్ల మధ్య సఖ్యత లేకపోవడంతో హరితహారం కాస్త అపహస్యంగా మారింది. గత ఏడాది హరితహారంలో ఒక్కో కార్పొరేటర్ వేయి మొక్కలు నాటేలా డిసైడ్ చేశారు. మొత్తంగా 3 లక్షలకు పైగా మొక్కలు నాటేలా రంగం సిద్ధం చేసినప్పటికీ మొక్కలకు బదులు మట్టిని గుంతలో పోసి పూడ్చివేసినట్లు చేసేశారు.

చీకిపోయిన ట్రీగార్డులు..

లక్షలు పోసి ట్రీగార్డులు తెచ్చి ఎండకు, వానకు, పెట్టడంతో అవి చీకిపోయి దేనికి పనికిరాకుండా పోయాయి. జూన్ నుంచి సెప్టెంబర్, అక్టోబర్‌లో వానలు పడే అవకాశం ఉంటుంది. కావున ఆ సమయంలో హరితహారం కార్యక్రమం చేపడితే బాగుంటుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు. కాల నీల్లో మొక్కలు, పచ్చదనం లేక ఎండలకు తట్టుకోలేక పోతున్నామని కాలనీవాసులు తీవ్ర విమర్శలు బహాటంగానే చేస్తున్నారు. ఏటా మొక్కలు తెచ్చుడు పంపిణీ చేయకుండా వదిలివేసుడు బడంగ్‌పేట కార్పొరేషన్ అధికారులకు పరిపాటిగా మారిందని ప్రజలు అంటున్నారు. ఈ సారి మొక్కలను వృథా చేయకుండా నాటి సంరక్షించేలా చూడాలని ప్రజలు కాలనీవాసులు కోరుతున్నారు.

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నేతల ధర్నా

హుడాకాంప్లెక్స్: తహసీల్దార్ కార్యాలయాల్లో కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను సకాలంలో అందించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కొన్ని బీసీ కులాలకు లక్ష రూపాయల పథకంలో భాగంగా కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాల కోసం మండల కార్యాలయంలో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని.. ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉండటంతో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. సిబ్బంది సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ దరఖాస్తుదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. లక్ష రూపాయల పథకం కోసం లబ్ధిదారులతో పాటు కౌన్సిలింగ్ సమయం కావడంతో అటు విద్యార్థులు కూడా అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ మధుసూదన్‌రావు, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సలీం, శ్రావణ్, పింటూ, ఇస్మాయిల్, అనుదీప్, యూసుఫ్, జహంగీర్, విజయ్, నగేష్, జగదీష్ పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాక్స్ డ్రెయిన్ పనులను పూర్తిచేయండి

మేయర్ చిగురింత పారిజాత



పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ సాయనగర్ కాలనీలో బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. బుధవారం కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత, డీఈఈ జ్యోతితో కలిసి పనులను పరిశీలించారు. వర్షాలు, వరదలు రాకముందే పనులు పూర్తిచేస్తే కాలనీలకు విముక్తి ఉంటుందని పనులు త్వరగా పూర్తిచేసేలా చూడాలని మేయర్ పారిజాత అధికారులను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండారి మనోహర్, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాలునాయక్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- మంత్రి సబితారెడ్డి
- కుర్మల్‌గూడలో బ్రాహ్మణ భవన్‌కు శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: బీఆర్‌ఎస్ సర్కార్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని మంత్రి సబితారెడ్డి తెలిపారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడలో నిర్మించనున్న బ్రాహ్మణ భవన్‌కు బుధవారం మంత్రి సబితారెడ్డి భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ వేదశాస్త్ర పండితులకు గౌరవవేతన భృతి రూ.2500 నుంచి రూ.5 వేలకు పెంచారని గుర్తుచేశారు. మహేశ్వరం నియోజవర్గంలో పురాతన దేవాలయాలకు పూర్వవైభవం తెచ్చేలా సుమారు రూ.8 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నగర పరిధిలోని అన్ని ఆలయాలకు దూపదీప నైవేద్యం, నిత్య పూజలు జరిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని బ్రాహ్మణులతో పాటు బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బ్రాహ్మణులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, కార్పొరేటర్ రోహిణి, బ్రహ్మణ సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ప్రారంభం..

పహాడీషరీఫ్: వైద్యరంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర మంత్రి సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 22వ వార్డు వాదే హదీస్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలతో పట్టణాల్లోని పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నూతన పీహెచ్‌సీలో మంత్రి బీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, స్థానిక కౌన్సిలర్లు సవూద్ అవల్గీ, షేక్ ఫమీదా అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ భవన్‌కు స్థలం కేటాయించండి..

బడంగ్‌పేట్: క్రైస్తవ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ క్రైస్తవ సోదరులు బుధవారం మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందించారు. కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో బ్రాహ్మణులకు కేటాయించిన సర్వే నెంబర్లలోనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని క్రైస్తవ భవనానికి కేటాయించాలని మంత్రికి విన్నవించారు. మంత్రి స్పందిస్తూ రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి స్థలం కేటాయించే విషయమై ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ జోసెఫ్ ఇమ్మాన్యువల్, జెరూసలెం ముత్తయ్య సెక్రెటరీ డా.జాషువా, పి.జయరాజు, సోమేశ్వర్‌రావు, డి.ప్రమోద్, లాజర్, డానియెల్, సాయిలు ఉన్నారు.

సీఐ మధుసూదన్‌కు ఘనంగా వీడ్కోలు



సీఐ మధుసూదన్‌ను సన్మానించిన సిబ్బంది, నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేసి భువనగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కి బదిలీ అయిన మధుసూదన్‌కు ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో సహకరించారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలతో కలిసి తాను మూడేళ్ల పనిచేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కల్వకోల్ సర్పంచ్ థామస్‌రెడ్డి, దుబ్బచర్ల, కేసీతండా సర్పంచ్‌లు స్లీవారెడ్డి, మోతీలాల్‌నాయక్, మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జాన్‌రెడ్డి, రాజేష్, లింగం, రాజు, కాంగ్రెస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు రాజునాయక్, బీజేవైయం మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఫరీద్, సీపీఐ నాయకులు గణేష్ పాల్గొన్నారు.

పెద్దమ్మతండాలో కంటివెలుగు శిబిరం



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న నాయకులు

కందుకూరు: కంటి వెలుగు పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని పెద్దమ్మతండాలో స్థానిక సర్పంచ్ సుమన్‌నాయక్‌తో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వమే ఉచితంగా పరీక్షలు చేసి కళ్లద్దాలతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవిపాండుగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, సంతోష్, శంకర్‌నాయక్, వార్డు సభ్యులు, వైద్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

బడంగ్‌పేట్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పేర్కొన్నారు. బుధవారం బాలాపూర్‌లోని 16వ డివిజన్ బీసీ యూత్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, సేనావత్ బాలునాయక్, సుదర్శన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు రఘునందన్‌చారి, జైహింద్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ముని, మహేశ్వరం సీఐ

మహేశ్వరం: మహేశ్వరం సీఐగా ఎం.ముని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామన్నారు. రియల్ ఎస్టేట్, ల్యాండ్ మాఫియా, భూకబ్జాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో చోరీలు, హత్యలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు. కాగా గతంలో ఆయన రాచకొండ పోలీస్ కంట్రోల్ రూమ్‌లో పనిచేశారు. ఇక్కడ ఇదివరకు పనిచేసిన సీఐ మధుసూదన్ భువనగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ఎరువు దుకాణాల్లో తనిఖీలు

తలకొండపల్లి: ప్రభుత్వం సూచించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రాజు ఆదేశించారు. తలకొండపల్లి, అంతారం, వెల్జాల్ గ్రామాల్లో క్రిమి సంహారక మందుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, నిల్వలను పరిశీలించారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వివిధ ఫర్టిలైజర్ దుకాణాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్థానిక పట్టణంలోని వాసుదేవ ట్రేడర్స్, ఆగ్రో రైతు సేవాకేంద్రం, వర్మ ఫర్టిలైజర్స్, ఆంజనేయ ఫర్టిలైజర్స్, లక్ష్మీ వేంకటేశ్వర ఆగ్రిషాపుల్లో తనిఖీలు నిర్వహించారు. మరికొన్ని పత్తి విత్తనాల నమూనాలను సేకరించి పరీక్షా కేంద్రాలకు పంపించారు. ఏఈఓలు సాయిరాం, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 11కేవీ విద్యుత్ నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని డీఈ కోరారు.

పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్‌కుమార్



పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన కాశీవిశ్వనాథ్ బదిలీ కావడంతో.. ఆయన నుంచి భువనగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న 2004 బ్యాచ్‌కు చెందిన సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ అమలయ్యేలా చూస్తానన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. పెట్రోలింగ్‌ను రౌండ్ ది క్లాక్ కొనసాగిస్తూ నేరాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

ఇంటి నిర్మాణాలకు చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనకు చెందిన లక్ష్మయ్య, వడ్ల కృష్ణయ్య ఇటీవల నూతన ఇంటి నిర్మాణాలు చేపట్టారు. డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణాలు నిలిపివేశారు. స్థానిక నాయకుడు, ఉపసర్పంచ్ సుధాకర్ సహకారంతో ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను కలిసి ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.స్పందించిన జెడ్పీటీసీ ట్రస్టు సభ్యులచే.. ఆయా ఇళ్ల నిర్మాణాలకు బుధవారం సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధాకర్, సింగిల్ విండో డైరెక్టర్ రఘువర్ధన్‌రెడ్డి, బక్కి రాఘవేందర్, రామచంద్రయ్య, మహేందర్, కృష్ణయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లపై మురుగు పరుగు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కార్గో రోడ్డుపై పారుతున్న మురుగు

పహాడీషరీఫ్: అంతర్గత బస్తీల్లో పారుతున్న మురుగును పట్టించుకోని జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు ప్రధాన రహదారులను సైతం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. షాహీన్‌నగర్ హుడా స్కూల్ ప్రాంతంలో ఏళ్ల తరబడి బస్తీల్లో మురుగు పారుతుండటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రంగా ఉన్న రహదారిని మూడేళ్ల క్రితం రూ.9 కోట్లు వెచ్చించి నూతనంగా బీటీ పనులు చేపట్టారు. కానీ మురుగు కారణంగా స్థానికులకు నిత్యం దుర్వాసన తప్పడం లేదు. ఈ క్రమంలోనే జల్‌పల్లి కార్గో రోడ్డులో సైతం ఈ మురుగు ప్రవాహం నిత్యకృత్యమయ్యింది. శ్రీరాంకాలనీ, ప్రెస్‌కాలనీ నుంచి మురుగునీరు రోడ్డుపై పారుతుండటంతో రోజురోజుకు రహదారి గోతులమయంగా మారుతుంది. మున్సిపల్ కమిషనర్ ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పెళ్లికి ఆర్థికసాయం అందజేత



పెళ్లికానుకు అందజేస్తున్న శ్రీనివాస్

మంచాల: గ్రామంలోని ఆడబిడ్డ పెళ్లిళ్లకు అండగా ఉంటామని బండలేమూర్ సర్పంచ్ మంగ శ్రీనివాస్ అన్నారు. బండలేమూర్ గ్రామంలో పాతులోత్ నాను–మంగమ్మ దంపతుల కూతురు పాతులోత్ రాణి పెళ్లికి బుధవారం రూ.10వేలు ఆర్థికసహాయం అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా గ్రామంలోని ప్రతి ఆడబిడ్డ పెళ్లికి పదివేలు, గ్రామంలో ఏవరైనా చనిపోతే రూ.5వేలు అందించడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. మాజీ సర్పంచ్ డాక్టర్ ఈశ్వర్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ నాతి చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు లక్ష్మణ్, శంకర్, హన్మంత్, దేవీలాల్, వార్డుసభ్యుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థికసాయం..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన గుంత శ్రీనివాసులు గత కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాసులు వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఫౌండేషన్ నిధులచే వ్యాధి చికిత్స నిమిత్తం ఆర్థికసహాయం అందజేస్తానని భరోసా పలికారు. ఫౌండేషన్ సభ్యులచే బుధవారం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్ యాదవ్, శ్రీను, రాఘవేందర్‌గౌడ్, రవి, జగన్, శివ, రాము పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించండి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: వెంకటాపూర్ క్రాస్ నుంచి పడకల్ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రోడ్డు పనులు చేపట్టాలంటూ బుధవారం వెంకటాపూర్ తండా నుంచి పడకల్ గ్రామం వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ అజీం, నాయకులు పాల్గొన్నారు.